


ఎండుకొండలో మెల్లిగా అప్పన్న దిబ్బ మీదికి రిక్షాలాగుతూ వడుస్తూ ఉన్న కింతాడ అప్పన్నకి ఎదురుగుండా వస్తున్న పల్లెటూరి జంట కనిపించింది. వాళ్ళిద్దరూ సముద్రపు—వడ్డుకి వెళ్ళి స్నానంచేసి తిరిగివస్తున్నట్టుంది. వాళ్ళ బట్టలు పూర్తిగా తడిసిఉన్నాయి. ఇద్దరూ నవ్వుతూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు. వాళ్ళని చూస్తుంటే అప్పన్నకి తన పూర్వపు జీవితం, తన పల్లెటూరు జ్ఞాపకంవచ్చాయి.

తన కెందుకో ఆ రోజులే ఎంతో హాయిగా, బాగా గడిచినట్లు అనిపిస్తూ ఉంటుంది. అవి యుద్ధం రాకముందు రోజులు. అప్పటికింకా తను రంగం వెళ్ళనే లేదు. అమ్మా, నాన్న యింకా బతికే ఉండే వాళ్ళు. రత్తమ్మ అప్పుడే కొత్తగా కాపరాని కొచ్చింది. పొద్దున్నే అంబలి తాగి, పొలం వెళ్ళి మధ్యాన్నందాకా పనిచేసేసరికి రత్తమ్మ బువ్వ పట్టుకొచ్చేది. ఇద్దరూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ చెట్టునీడలో కూర్చుని బువ్వ తినేవారు. పొద్దుగూకే వరకి యిల్లు చేరుకునేవాడు. అమ్మ యేదో యింత వడ్డించేది. తిని, చుట్టకాల్చుకుంటూ మంచంమీద పడుకుని కూనిరాగాలు తీస్తూ ఉండేసరికి యిరుగూ పొరుగూ యిక్కడ మాటువుణిగేది. పల్లెఅంతా, చీకటిపడేసరికి తాటిచెట్లనీడలో కలిసి నిద్రపోయేది. ఇంతలో రత్తమ్మ వచ్చి "ఏటోసి మొద్దునిద్దర. కసింత సోటెట్టు" అని పక్కలో చేరేది.

పెద్దోడు పుట్టేవరకూ బతుకు హాయిగా ఏటిలో తెప్పలాగా తేలిపోయింది. పెద్దోడు పుట్టడంతోనే, పెళ్ళానికి జబ్బుచేసింది. ఆ గండం గడిచి పోవాలని సింహాద్రి—అప్పన్నకి మొక్కుకున్నాడు. మొక్కు ఫలించింది. గండం గడిచింది. పెద్దోడికి అప్పన్న—పేరే పెట్టుకున్నాడు. పెళ్ళాంతో కలిసి సింహాచలం—యాత్రచేశాడు. అట్నుంచి తిరిగొచ్చి విశాఖపట్నంలో సముద్రస్నానం చేశాడు. అబ్బ! అప్పటికీ, యిప్పటికీ పట్నంలో ఎంత తేడా! అసలీ అప్పన్న దాటితే, అంతా అడవిలాగుండేది. అటు వెళ్ళడానికి పట్టపగలే భయపడేవారు జనం. అలాటిది ఎటు చూసినా హనుమంతుడి తోకలాగా తెగ పెరిగిపోతున్నది ఊరు. ఇలా ఆలోచించుకుంటూ ఉంటే, అప్పన్న—గేటు దగ్గరకొచ్చింది. "కొంచెం లోపలికి తీసుకెళ్ళు నాయనా. ఎండలో వడవలేదు అమ్మాయి" అంది రిక్షాలోపలి ముసలమ్మ. నెమ్మదిగా మూలుగుతున్నది ఆ అమ్మాయి, మొఖమంతా పాలిపోయిఉంది. "అల్లాగేనమ్మా. నాను తీసుకెల్తాగా, మీకెందుకి తొందర" అని నెమ్మదిగా గేటు దాటి లోపలికి మెట్లదగ్గరికి తీసుకెళ్ళాడు. రిక్షా దిగుతుంటే, అడిగాడు అమ్మాయికి పిల్లలెంతమందని. ఎంతమందెక్కడ నాయనా! ఇదే తొలికానుపు. అసలే నలతగాఉంది. డాక్టరమ్మ పరీక్షచేసి ముందుగానే అప్పన్నలో చేర్చమంది. కానుపు కొంచెం కష్టమవుతుంది అని చెప్పింది. అంచేత యిప్పుడు జేర్చడానికి తీసుకెళ్తున్నామని చెప్పింది ముసలమ్మ. పాలిపోయిన ఆ అమ్మాయి—ముఖం చూస్తే అప్పన్నకి ఏవో తలపుకి వచ్చాయి. నెమ్మదిగా రిక్షా వెనక్కి మళ్ళించాడు.

* * *

ఆ రోడ్డుమీద నిన్నమొన్నటి దాకా రిక్షా లాగేడు! [illegible] తీసుకెళ్తున్నాడు. కళ్ళు మూసుకొని తీసుకెళ్ళగలడు రిక్షాని ఆ రోడ్డుమీద. నమ్మకంగా తీసుకెళ్తాడని తన రిక్షాలోనే పంపిస్తారు ఆ పిల్లల్ని. వాళ్ళకికూడా తనంటే ఇష్టం. రిక్షా—తాతా అని దారిపొడుగునా ఏవో కబుర్లు చెప్పుతూ అల్లరి చేస్తుంటారు. అందులో ఆఖరి అబ్బాయి మరీ పెంకి. ఆ అబ్బాయిని చూస్తే, రెండోవాడు రంగడు జ్ఞాపకంవస్తాడు. ఎంత అల్లరిచేసేవాడు! ఎప్పుడూ ఇంట్లో ఉండేవాడుకాదు. గుంట—జట్టుని వెనకేసుకొని తోటల్లోకి పోయేవాడు. వాడిని వెతికి పట్టుకొచ్చేసరికి తాతలు దిగొచ్చేవారు. ఒకోసారి చీకటిపడ్డా, తిరిగి వచ్చేవాడుకాదు. వాడేమవుతాడోనని తనకి బెంగ. కాని రత్తమ్మకి వాడంటే మంచి ధైర్యం. "వాడెక్కడికీ పోతాడు, నీ బయ్యం గాని" అనేది. వాడింకా బతికుండగానే రంగం—వెళ్ళాడు. పల్లెలో పంటలు సరిగా పండక, మూడేళ్ళు కరువుపట్టింది. ఎప్పుడూ లోటెరగని తనకు దశ ఎలా మారిందో తెలియదు. అందరితోబాటు తనూ పదంటే పదమని రంగం బయలుదేరాడు. అప్పన్నకి రంగంలో డబ్బు బాగానే దొరికేది. కాని రంగంలో తను పడిన బతుక్కి ఎంత డబ్బొస్తే మాత్రం ఆగుతుందా? ఏదో కొంత యింటికి పంపేవాడు. మిగతాదంతా ఎలా వచ్చేదో అలాగే ఖర్చుపెట్టేవాడు. అప్పటి అలవాట్లు యింకా పదల్లేదు. సల్లమందు లేకపోతే బతకలేడు. అప్పన్న జీవితానికి రంగంలో గడిపిన కాలం ఒక విచిత్రమైన అనుభవం. సుఖంగా లేకపోయిన మంచి దశ. ఒంటరిగా ఉండేవాడు. వంట్లో వేడినెత్తురు ప్రవహించేది. పెళ్ళాం, బిడ్డలమీద మమకారం ఉన్నా

[illegible]



## ఉచితము ఉచితము

లైసెన్సు అక్కరలేదు. అమెరికన్ మోడల్ 6 షాట్ రిపీటెడ్ డయల్ దొంగలు, క్రూర మృగములు మొ॥ అన్నిటికి రక్షణ. పిక్‌నిక్, యాత్ర, డ్రామాలలో ఉపయోగించవచ్చును. పెద్ద ధ్వనితో, ప్రకాశవంతమైన కాంతివిగలిగించి భయం కల్పించును. పిస్టలుతో 200 షాట్లు ఉచితము. ధర నెం. 555 రు. 6/- నెం. 666 రు. 8/- నెం. 777 రు. 11/- పోస్టేజి రు. 2/- అదనం. మేలురకం తోలుకేసు, బెల్టుతోసహా రు. 5 అదనపు షాట్లు 100కి రు. 3/- ప్రత్యేక కానుక: ప్రతి పిస్టలుతో ఒక 50 షాట్ పిస్టలు, 50 షాట్లతో ఉచితముగా పంపబడును.




**GARRICKS (INDIA) P.F, 2., Mamubhanja, Aligarh.**





## స్నానానంతరం పరిశుభ్రత— రోజల్లా!

సర్వదా చల్లగాను, పరిశుభ్రంగాను, ఆనందంగాను ఉండండి. అదియే స్నానానంతరం చల్లుకుంటే నివియా టాల్కమ్ పౌడర్ సమకూర్చే సుగుణం! దీనిలో ప్రత్యేక పదార్థం, హెక్సాక్లోరోఫీన్ వున్నది. అది స్నానానంతరం కలిగే అద్భుతమైన ప్రకాశమాన దేహకాంతిని నిలిపి యుంచుతుంది. మీ చర్మానికి వాడదగినది నివియా టాల్కమ్ పౌడర్... దాని మనోహర పరిమళం....దాని పుష్పరేకువంటి మృదులత.




# నివియా టాల్కమ్ పౌడర్

సుందరమైన అణచ బడిన నీలం - తెలుపు ప్యాకెట్‌లో సులువుగా చల్లుకో దగినది !

S&N

*Aiyars T-241-TEL*


# కాలచక్రం

నికి ఏమీ తోచలేదు. వాడికి చెప్పినా, వాడు వినే రకం కాదు. పైగా, వాడు చెప్పేదానికన్నా బాగున్నట్టే తోచింది. వాడి బుర్రలో ఉన్నది యిప్పటికి నెమ్మదిగా అర్థమవుతున్నట్టు అనిపించింది. లేచి, చుట్ట ముట్టించాడు. గొంతుసవరించుకొని పెళ్ళాన్ని కూకలేశాడు : "ఓసె నువ్వూరుకోవే. మనకన్నా బుద్ధిమంతుడేనే వాడు. ఆడు చెప్పింది వినుకో; మన లాగా అణ్ణి పెద్దైపొమ్మంటే ఎలా ? ఆడివైనా కుసింత బాగుపడనీ. నే నిన్నాళ్ళు కట్టపడ్డాను. ఇంకో ఏడు యీడవలేనా యీ మొండిబతుకు. ఇన్నాళ్ళు పోషించినోణ్ణి యింత తిండెట్టలేనేటి మీకు? అన్నిటికీ ఆ బగమంతుడే ఉన్నాడు. ఆడిదే బారం" అనేసి నెమ్మదిగా చుట్ట—కాల్చడం మొదలెట్టాడు.

* * *

పెద్దవాడు వర్కుషాపుకి వెళ్ళడం మొదలు పెట్టాడు. తనకి రోజురోజుకీ జబ్బు ముదురుతున్నట్టు అనిపిస్తున్నది. ఏరోజు గుటుక్కుమంటుందో ప్రాణం. తను చచ్చిపోతే తమ్ముళ్ళని చెల్లెళ్ళని సరిగా చూస్తాడో లేదో వాడు. ఆఖరివాడు అందరికన్నా చురుకైనవాడు. ఆరేళ్ళు నిండాయో లేదో, వాడికి అన్ని సినిమాల సంగతీ తెలుసు; అన్ని బస్సుల సంగతీ తెలుసు. వాడికి తెలీని సంగతి లేదేమో ననిపిస్తుంది. పైగా దగ్గర్లో ఉన్న బడికి వెళ్తున్నాడు. వాణ్ణి చూస్తే చచ్చిపోయినవాడు జ్ఞాపకం వస్తాడు.

ఆరోజు పొద్దున్నే లేచి, వాడు పితూరి చేస్తున్నాడు; బట్టలు లేవని. బట్టలు ఉతికి యిస్తానని అగమంటుంది తల్లి. వినిపించుకోడు వాడు. నాన్నని చూడగానే వాడు "నాన్నా! ఇవాళ మంచి బట్టలు వేసుకొని రమ్మన్నారు మేష్టార్లు; ఎవరో పెద్దాయన వస్తాడట. మా అందరికీ ప్రయిజు లిస్తారట" అన్నాడు. వాణ్ణి సర్దిచెప్పి చదువుకోమని పంపించాడు. వాడు గెంతుకుంటూ వెళ్ళి చిన్న పుస్తకం తీసుకొని ఏదో వల్లెవేస్తున్నాడు. మధ్య మధ్యలో బడి గురించి, సినిమాల గురించి ఏవో చెబుతున్నాడు. "నాన్నా! వచ్చే నెల నెహ్రూ వస్తాడట, మమ్మల్నిందర్నీ తీసుకెళ్తారట మీటింగుకి. నెహ్రూ మన రాజు కదూ ?" అని అడిగాడు.

వాణ్ణి చూస్తుంటే, వాడి మాటలు వింటూంటే అప్పన్న పొంగిపోతాడు. తన కష్టాలన్నీ మరచిపోతాడు. "నేను బాగా చదువుకొంటాను. పెద్ద డాక్టరవుతాను" అన్నాడు వాడు.

"ఓ యబ్బ! నీ మొకానికి అదొకటే తక్కువ. ఒల్లకుండేసి" అంది రత్తమ్మ.

ఈ మాటలు వింటున్న అప్పన్న లేచి "అవునే! ఆడు డాక్టరవుతాడు. ఆడు మనలాగ కాదు. పెద్ద సదువులు సదువుతాడు. నేను సచ్చిపోయేలోగా చూస్తానో లేదో. ఆడు మాత్రం రిక్షాలు లాగడు; గుడిసెల్లో ఉండడు. ఆడు గొప్పోడవుతాడు" అని ఏదో ఆవేశంగా అన్నాడు. అప్పుడే తన కొడుకులు పెద్దవాళ్ళై, తను కలలో కూడా అనుకోని కొత్త రకం జీవితాన్ని గడుపుతున్నట్టు ఊహించుకొన్నాడు. ఆ ఊహతో అలాగే మంచంమీద నడుం వాల్చి కళ్ళు మూసుకొన్నాడు. ★